ఛీకెన్.. తినమే తినం..!

- వెలవెలబోతున్న చికెన్ దుకాణాలు
- భయపెడుతున్న బర్డ్‌ఫ్లూ భూతం
- కోడిగుడ్లనూ దూరం పెడుతున్న జనం
- మటన్, చేప, రొయ్యలకు పెరిగిన డిమాండ్
- ఇదే అదనుగా ధరలు పెంచుతున్న వ్యాపారులు


మార్కెట్లో చేపల విక్రయాలు

ముమ్మిడివరం: కోళ్లకు బర్డ్‌ఫ్లూ భూతం కాటేయడంతో మాంసాహారులు మటన్, చేపలపై మక్కువ చూపుతున్నారు. బర్డ్‌ఫ్లూ ప్రబలడంతో చికెన్ తినరాదని అధికారులు ఆదేశాలు జారీ చేయడం.. గత వారం రోజులుగా చికెన్ షాపులు మూసి వేయడంతో చికెన్ ప్రియులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా మటన్, చేపలను వినియోగించడంతో వాటి ధరలు కొండెక్కుతున్నాయి. హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో సైతం చికెన్ వినియోగించక పోవడంతో ప్రత్యామ్నాయం కోసం వెతుకులాడుతున్నారు. ఈ నేపథ్యంలో చేపలు, రొయ్యలు, మటన్ దుకాణాలకు వినియోగదారులు పోటెత్తుతున్నారు. దీంతో ఆ దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని మార్కెట్ సెంటర్, మురమళ్ల, కాట్రేనికోన, తాళ్లరేవు, యానాం వంటి ప్రాంతాలలో చికెన్ సెంటర్లు వెలవెలబోతుంటే మటన్, చేపల మార్కెట్‌కు మాత్రం మాంసాహార ప్రియులు ఎగబడుతున్నారు.

పెరిగిన ధరలు

చికెన్‌కు వినియోగదారులు దూరంగా ఉన్న పరిస్థితులలో మటన్, చేపల కొనుగోలుకు మాంసాహారులు అధిక ప్రాధాన్యత చూపుతున్నారు. దీంతో మటన్ ధర కిలోకు వంద రూపాయల వరకు పెంచేశారు. గతంలో కిలో రూ.800లు ఉండే ధర ఇప్పుడు రూ.900 కు చేరింది. మార్కెట్‌లో మేకలు, గొర్రెలు ధరలు విపరీతంగా పెరిగాయని, ఒక్కో మేక, గొర్రె ధరను గతంతో పోల్చితే రూ.1500 నుంచి రూ.2వేల వరకు యాజమానులు పెంచేశారని విక్రయదారులు అంటున్నారు. చేపలు, గోదావరి రొయ్యలను సైజును బట్టి రూ.300 నుంచి రూ.400 వరకు అమ్ముతున్నారు.

ప్రత్యామ్నాయంగా..

హోటల్స్‌లో చికెన్‌కు ప్రత్యామ్నాయంగా మటన్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తుండగా చిన్నపాటి హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లలో బిర్యానీతో మటన్ కైమా, రొయ్య, మేక తలకాయ మాంసం, బోటీలను కూరలుగా వండి అమ్మకాలు చేస్తున్నారు. స్ట్రీట్ ఫుడ్ బళ్లలో ఫ్రైడ్‌రైస్, నూడిల్స్‌ను సైతం చికెన్, కోడిగుడ్డు లేక వెజ్ ఐటంగా అమ్మకాలు చేస్తున్నారు. ఎన్ని రకాల ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించినా చికెన్‌ను బీట్ చేయలేమంటూ మాంసాహారులు అభిప్రాయపడుతున్నారు. మాంసాహారంలో చికెన్ ఒక్క దానికే రకరకాల రూపాల్లో తీర్చిదిద్ది లొట్ట లేసుకుంటూ తినే పరిస్థితి ఉంది. మిగిలిన వాటికి అన్ని రకాలుగా తీర్చిదిద్దే పరిస్థితి లేకపోవడంతో మాంసాహారులలో కొంత నైరాశ్యం కనిపిస్తోంది. దీంతో చేసేది లేక మటన్, చేపలపైనే మక్కువ చూపాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి.

చికెన్ అంటే ఇష్టమే గానీ..



చికెన్ బిర్యానీ అంటే చాలా ఇష్టం. అయితే కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి రావడంతో చికెన్ విక్రయాలు మానేశారు. చికెన్ తినాలంటేనే భయమేస్తోంది. మటన్, చేపలు కంటే చికెన్ ఎక్కువగా తినేవాడిని. ఇప్పుడు పరిస్థితులను బట్టి వాటికి దూరంగా ఉండాల్సి వస్తోంది. చికెన్‌తో అనేక రుచికరమైన వంటకాలు ఉన్నాయి. వాటికి దూరమవ్వడంతో కాస్త బాధగా ఉంది.

– చెల్లి శ్రీనివాసరావు, గాడిలంక.

వైభవంగా లక్ష కుంకుమార్చన


లక్ష కుంకుమార్చనలో మహిళలు

అమలాపురం టౌన్: స్థానిక గాంధీనగర్‌లో వేంచేసి యున్న కనకదుర్గమ్మ ఆలయ 29వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారి సన్నిధిలో మహిళలతో లక్ష కుంకుమార్చన మంగళవారం వైభవంగా జరిగింది. దాదాపు 200 మంది మహిళలు సామూహికంగా అమ్మవారికి కుంకుమార్చన పూజలు గావించారు. వేద పండితులు వెలవలపల్లి సోమేశ్వర శర్మ, ఆలయ అర్చకులు రామేశ్వరపు రామప్రసాద్ పర్యవేక్షణలో మహిళల చేత లక్ష కుంకుమార్చన చేయించారు. మేడిద సుధీర్‌కుమార్, లలిత దంపతులచే నవగ్రహ జపార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తిక్కిరెడ్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు భక్తులకు సేవలందించారు. అనంతరం ఆలయం వద్ద జరిగిన అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య పరీక్షలు

అమలాపురం టౌన్: భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో ఉచిత కంటి వైద్యశిబిరం మంగళవారం జరిగింది. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయానికి చెందిన వైద్య బృందం ఈ శిబిరంలో వైద్య సేవలు అందించారు. పట్టణానికి చెందిన డాక్టర్ బి.రాఘవేంద్రరావు జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా సత్యసాయి సేవా సమితి కన్వీనర్ అడబాల కొండబాబు, అమలాపురం డివిజన్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్‌లు శిబిరాన్ని పర్యవేక్షించారు. శిబిరంలో మొత్తం 138 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 10 మంది రోగులకు శస్త్రచికిత్సలకు సిఫార్సు చేసి 32 మందికి కళ్లజోళ్లు అందించారు. అమలాపురం పట్టణ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ నూలు సుబ్బారావు, సమితి సీనియర్ సభ్యులు గోకవరపు సుబ్రహ్మణ్యం, మంథా కామేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాస్ తదితరులు రోగులకు సేవలు అందించారు.

నవోదయ విద్యాలయాల పరిశీలన


భోజనశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మల్లాడి

యానాం: యానాం మెట్టకూరులో జవహర్ నవోదయ విద్యాలయాలను మంగళవారం పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆకస్మికంగా పరిశీలించారు. విద్యాలయంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆహార పదార్థాలను తయారు చేసే వంటగదిని పరిశీలించారు. విద్యార్థులతో పాటు భోజనం రుచి చూశారు. మెట్టకూరు గణపతినగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు మల్లాడి కృష్ణారావును కోరారు. గ్రామంలో పర్యటనకు వచ్చిన ఆయనకు స్థానికులు పలు సమస్యలను వివరించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఐ.పోలవరం: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ లైను నిర్మాణ పనుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరాకు అవాంతరం ఏర్పడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కె.రాంబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐ.పోలవరం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఆర్‌డబ్ల్యూఎస్, 11 కేవీ గుత్తినదీవి ఫీడర్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. ఈ కారణంగా జి.మూలపొలెం, ఎర్రగరువు, చిన్నకొడప గ్రామాలు, దుప్పలంక ఏటిగట్టు ఆక్వా చెరువులు, జి.వేమవరం ఏటిగట్టు ఆక్వా చెరువులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ తెలిపారు.

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులోని విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కాకినాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

ముమ్మిడివరం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దిడ్ల వీర రాఘవులుకు ఓటు వేసి గెలిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గా ప్రసాద్, ఎస్.అబ్బులు ముమ్మిడివరంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాదే శ్రీను, ఎం.లక్ష్మణరావు పాల్గొన్నారు. మరోవైపు కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు చేసి గెలిపించాలని మంగళవారం ముమ్మిడివరంలో కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు.

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ డ్రైవ్

అమలాపురం రూరల్: జిల్లాలోని 69 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి శుక్రవారం వరకు ప్రత్యేక ఆధార్ డ్రైవ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ డ్రైవ్‌లో కొత్తగా జన్మించిన శిశువుల న్యూ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, ఐదేళ్ల నుంచి ఏడేళ్ల మధ్యలో పిల్లలకు, 15 ఏళ్ల నుంచి 17 ఏళ్ల లోపు వారికి మాండెటరీ బయోమెట్రిక్ అప్డేట్ చేయనున్నారు. జిల్లాలో సుమారు 99 వేల పైచిలుకు విద్యార్థులు అప్డేట్ చేసుకోవాల్సి ఉందన్నారు.

ఆర్టీసీ ఎన్ఎంయూ ఉద్యోగుల ఆందోళన

అమలాపురం రూరల్: ఉన్నతాధికారులు ఇచ్చిన సర్క్యులర్ ఆదేశాలు పాటించకుండా బీఎస్.నారాయణ అనే ఉద్యోగిని సస్పెండ్ చేయడంపై ఆర్టీసీ ఎన్ఎంయూ ఉద్యోగులు మంగళవారం డిపో వద్ద ధర్నా నిర్వహించారు. అమలాపురం డిపో డీఎం ఇచ్చిన సస్పెన్షన్ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉత్తర్వులను రద్దు చేయాలని జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు.

నిధులు మంజూరైనా పనులు ప్రారంభించరా?

ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్ ఆగ్రహం


మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: కోట్లాది రూపాయల ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు, నామినేటెడ్ ఎమ్మెల్యేల నిధులు మంజూరై శంఖుస్థాపనలు చేసి నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించకుండా అధికారులు కావాలనే కాలయాపన చేస్తున్నారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్ కె రామకృష్ణ, అధికారులతో సమావేశమయ్యారు. యానాం మున్సిపాలిటీ పరిధిలో పలు మౌలిక సౌకర్యాలకు ఆది ద్రావిడ సంక్షేమ శాఖ నుంచి నిధులు మంజూరయ్యాయని కాని ఇప్పటి వరకు పనులు ఎందుకు ప్రారంభించలేదని అధికారులను ప్రశ్నించారు. త్వరితగతిన పనులు చేపట్టకపోతే తాను ఆయా కార్యాలయాల వద్ద నిరసనకు దిగుతానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఈలు కుమార్, లక్ష్మి, చెల్లిగోపీ పాల్గొన్నారు.

ఏమీ.. స్వామిభక్తి..!

- ఎన్నికల నియమావళిని పట్టించుకోని అధికారులు
- అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలను తొలగించేందుకు విముఖత
- వెల్లువెత్తుతున్న విమర్శలు


భీమనపల్లి పంచాయతీ కార్యాలయం ఎదుట దర్శనమిస్తున్న కూటమి నాయకుల ఫ్లెక్సీలు

ఉప్పలగుప్తం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులోకి వచ్చి పక్షం రోజులు దాటుతోంది. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను తొలగించడంతో పాటు విగ్రహాలకు ముసుగులు వేయాలని ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ఎన్నికల నియమావళిని గ్రామాల్లోని పంచాయతీ అధికారులు అమలు చేయాల్సి ఉంది. అయితే ఉప్పలగుప్తం మండలంలోని గ్రామాల్లో ప్రధాన సెంటర్లలో ప్రభుత్వ కార్యాలయాలపై అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలు దర్శనమివ్వడంతో జనం ముక్కున వేలేసుకుంటున్నారు. నాయకుల ఫ్లెక్సీలను తొలగించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడంపై పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. నాయకులపై అధికారుల స్వామిభక్తికి ఈ చర్య అద్దం పడుతోంది.

అల్లవరం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా కూటమి నేతలు ఎక్కడా తగ్గడం లేదు. ఎన్నికల కోడ్ ప్రతిపక్షాలకే గానీ మాకు కాదు అనే రీతిగా వ్యవహరిస్తున్నారు. కోడ్ అమల్లో ఉన్న సమయంలో ప్రజా ప్రతినిధులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొనకూడదన్న నిబంధన ఉంది. బోడసకుర్రు పంచాయతీ పరిధిలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం శానిటేషన్ నిర్వహించారు. వైద్య శాఖ చేస్తున్న శానిటేషన్‌కు స్థానిక సర్పంచ్ భర్త రొక్కాల నాగేశ్వరరావు, మరో జనసేన నేత దగ్గర ఉండి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కోడ్ అమల్లో ఉండగా అధికార కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులు దూరంగా ఉండాల్సి ఉండగా శానిటేషన్ కార్యక్రమంలో జనసేన నేతలు పాల్గొనడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి నేతలు కోడ్‌ను ఉల్లంఘిస్తున్న మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఎందుకు వత్తాసు పలుకుతున్నారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.


విలసవిల్లి పంచాయతీ కార్యాలయంపై..


అల్లవరంలో శానిటేషన్ పనుల్లో పాల్గొన్న కూటమి నేతలు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో సాగాలి

జేసీ నిషాంతి


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న జేసీ నిషాంతి, ఆర్డీవో మాధవి

అమలాపురం రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. భట్లపాలెంలోని బీవీసీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ మాట్లాడుతూ అధ్యాపకులు బోధనలో మరింత ఉన్నత ప్రమాణాలు అందుకోడానికి కృషి చేయాలన్నారు. వేడుకల్లో భాగంగా వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జేసీ, ఆర్డీవోలు నగదు బహుమతులు అందించారు. కళాశాల కార్యదర్శి బోనం కనకయ్య, ప్రిన్సిపాల్ జేవీసీ రామారావు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఫణిశంకర్ తదిరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో అంగన్‌వాడీల పాత్ర కీలకం

డీఈవో సలీమ్ బాషా


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో డాక్టర్ సలీమ్ బాషా

అమలాపురం టౌన్: విద్యా వ్యవస్థలో అంగన్‌వాడీ కార్యకర్తలూ ఓ భాగమేనని డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా అన్నారు. స్థానిక కొంకాపల్లి జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అమలాపురం రూరల్ మండలానికి సంబంధించి అంగన్‌వాడీ టీచర్లకు ఆరు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. అంగన్‌వాడీ కోర్సు కోఆర్డినేటర్, అమలాపురం ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం అధ్యక్షత వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శాంతి కుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించారు. సీడీపీవో విజయశ్రీ, ఎంఈవో సరెళ్ల దుర్గాదేవి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బీఎన్ వెంకటేశ్వరరావు, రిసోర్స్ పర్సన్లు కిషోర్ కుమార్, శ్రీనివాస్, మహేష్‌బాబు, అన్నపూర్ణేశ్వరి, కుమారి, గణేశ్వరి, రెహ్మాన్, సీఆర్ఎంటీ అనూష తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ అసోసియేషన్ నియామకం

ఉప్పలగుప్తం: మండలంలోని గోడివారిపేటలో ఉప్పలగుప్తం పాస్టర్స్ వెల్ఫేర్ నూతన కార్యవర్గ నియామకం మంగళవారం జరిగింది. అధ్యక్షులుగా టీకేవీ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా మావూరి కిరణ్, గౌరవ అధ్యక్షులుగా మెండి దైవదాస్, తోకల శరత్‌బాబు, కార్యదర్శిగా డీఆర్ఎస్ శాస్త్రి, సంయుక్త కార్యదర్శిగా లంకే డేవిడ్, కోశాధికారిగా జనిపెళ్ల ఇస్సాక్‌లు నియమితులయ్యారు. మండలంలోని ఆయా సంఘాలకు చెందిన చర్చి పాస్టర్‌లు వారిని అభినందించారు.

నేడు డయల్ యువర్ డీఎం

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ డీయం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి తెలిపారు. ప్రయాణికులు తమ సలహాలు, సూచనలను 9581932678 నంబరు ద్వారా తెలియజేయవచ్చునని తెలిపారు. అమలాపురం డిపో పరిధిలోని ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని కోరారు.

మహా కుంభమేళాకు బస్సు ప్రారంభం


బస్సును ప్రారంభిస్తున్న ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు

అమలాపురం రూరల్: మహా కుంభమేళాకు అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సును మంగళవారం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎనిమిది రోజుల పాటు జరిగే యాత్రలో కోణార్క్ సూర్యదేవాలయం, భువనేశ్వర్, పూరీ, ప్రయాగరాజ్, అయోధ్య, వారణాసి, గయ, పాదగయ క్షేత్రాల దర్శనం ఉంటుందన్నారు. డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ 21న మరో రెండు బస్సులను కుంభమేళాకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రిజర్వేషన్‌ల కోసం 9959225576, 7382909620 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గురు సందేశంతో జ్ఞాన సముపార్జన


శ్రీధర నిర్మలాశ్రమంలో వేదాంత సభలో సందేశం ఇస్తున్న గురువులు

తాళ్లరేవు: జ్ఞాన సముపార్జన చేసిన గురువుల సందేశాలను పాటించడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చని పలువురు గురువులు పేర్కొన్నారు. కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామంలో శ్రీధర నిర్మలాశ్రమం 61వ వార్షిక ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం ఆశ్రమ పీఠాధిపతులు కొపనాతి బాలకృష్ణ, ఆశ్రమ అధ్యక్షులు కెల్లా ఆదినారాయణల పర్యవేక్షణలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రెండు రోజుల పాటు మేలుకొలుపు, ప్రభాత సేవ, గురు గీత పారాయణం, నగర సంకీర్తన, అచల పతాకావిష్కరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గురువులు సందేశాలు ఇచ్చారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కొపనాతి లలిత, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సత్తెమ్మ జాతర చూతము రారండి

నేటి నుంచి తీర్థ మహోత్సవాలు ప్రారంభం


సత్తెమ్మ తల్లి

ముమ్మిడివరం: సిరుల తల్లిగా భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ తల్లి జాతర, తీర్థ మహోత్సవాలను ఈ నెల 19 నుంచి 23 వరకు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19 నుంచి ఐదు రోజులు పాటు ఏర్పాటు చేసిన కూచిపూడి నాట్యం, జానపద గేయాలు, సంగీత విభావరి ఆద్యంతం ఆకట్టుకోనున్నాయి. 23న అమ్మవారి తీర్థ మహోత్సవాలు వైభవోపేతంగా జరగనున్నాయి. మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి భారీ ఊరేగింపు జరగనుంది. ఈ ఊరేగింపులో సుమారు 2వేల మంది కళాకారులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భారీ సెట్టింగులతో మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. అమ్మవారి సన్నిధిలో సుమారు 30వేల మందికి అన్న సమారాధన నిర్వహించనున్నారు.

శివారుకు సాగునీటి ఎద్దడి నివారణే ధ్యేయం

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: యానాం నియోజకవర్గ శివారు ఆయకట్టు పంట పొలాలకు సాగునీటి ఎద్దడిని తీర్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పిల్లంక నుంచి ఫ్రెంచి కెనాల్ ద్వారా వచ్చే సాగునీటి అరటికాయలంక పంపింగ్ హౌస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దరియాలతిప్ప ఆయకట్టు ప్రాంతానికి సాగునీరు అందకపోవడంతో పంట పొలాలు ఎండిపోయే స్థితికి వచ్చాయన్నారు. అనంతరం పీడబ్ల్యూడీ ఈఈ, ఏఈలను పంపింగ్ హౌస్ వద్దకు పిలిపించి కాలువ నుంచి పంపింగ్ హౌస్‌కు వచ్చే నీటిమట్టాన్ని పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడారు. యానాంకు ఇచ్చే సాగునీటి వంతును పెంచాలని ముఖ్యంగా తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, పీడబ్ల్యూడీ ఈఈ చంద్రశేఖరన్, ఏఈ, జేఈలు నాగరాజు, జ్యోతిరాజు, రైతులు తిరుకోటి భైరవమూర్తి, బాలయోగి, వెంకన్న, ఆనందరావు, శ్రీను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తల్లి మరణ వార్తతో వెనుదిరిగిన మంత్రి

హుటాహుటిన పుదుచ్చేరి వెళ్లిపోయిన సాయిశరవణన్

యానాం: యానాంలో రెండు రోజుల అధికార పర్యటనకు సోమవారం రాత్రి వచ్చిన పుదుచ్చేరి ఆది ద్రావిడ సంక్షేమ శాఖామంత్రి ఏకే సాయిశరవణన్ కుమార్ మంగళవారం తెల్లవారు జామున అర్థాంతరంగా తన కార్యక్రమాలను రద్దు చేసుకుని పుదుచ్చేరి వెళ్లిపోయారు. ఆయన తల్లి సుబ్బులక్ష్మి మంగళవారం తెల్లవారు జామున పుదుచ్చేరి ఉజ్వారై మున్సిపాలిటీ పరిధిలోని లాస్‌పేటలో స్వగృహంలో మృతి చెందినట్లు పుదుచ్చేరి నుంచి సమాచారం వచ్చింది. దీంతో ఆయన కారులో యానాం నుంచి విశాఖపట్టణం విమానాశ్రయం చేరుకుని అక్కడ నుంచి పుదుచ్చేరి చేరుకున్నారు. మంత్రి తల్లి సుబ్బులక్ష్మి మృతి పట్ల ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సంతాపం వ్యక్తం చేశారు.

బాబ్జీ మృతికి అగ్రిగోల్డ్ బాధితుల యూనియన్ సంతాపం

అమలాపురం టౌన్: జిల్లా అగ్రి గోల్డ్ బాధితుల యూనియన్ న్యాయ సలహాదారుడు పచ్చిమాల బాబ్జీ మృతికి ఆ యూనియన్‌కు చెందిన బాధితులు సంతాపం తెలిపారు. స్థానిక కొంకాపల్లిలో మంగళవారం జరిగిన బాబ్జి సంతాప కార్యక్రమంలో బాధితుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు పులపర్తి సురేష్‌కుమార్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ మూసివేసినప్పటి నుంచి జరిగిన అనేక పోరాటాలు, ఉద్యమాల్లో బాబ్జి నేరుగా పాల్గొనడమే కాక న్యాయ సలహాలు ఇచ్చేవారని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం చేసేందుకు ఆయన జిల్లా యూనియన్‌తో కలిసి మాట్లాడిన సందర్భాలను తలుచుకుని కన్నీటి పర్యంతమయ్యారు. యూనియన్ జిలాల్ కార్యదర్శి శీలం లంకేశ్వరుడు, కోశాధికారి పి.శ్రీరామమూర్తి తదితరులు బాబ్జి మృతి పట్ల సంతాపం తెలిపారు.

యూపీహెచ్‌సీల నూతన కార్యవర్గం ఎన్నిక


యూపీహెచ్‌సీ కమిటీ నూతన కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్: యూపీహెచ్‌సీల జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక ఈడబ్ల్యూఎస్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటరులో మంగళవారం జరిగింది. జిల్లా యూపీహెచ్‌సీ నూతన కమిటీ అధ్యక్షునిగా వి.గణేష్, ప్రధాన కార్యదర్శిగా ఎం.బాబూరావు, కోశాధికారిగా పి.సురేష్, ఉపాధ్యక్షులుగా ఆర్.రాము, సౌదామణి, సంయుక్త కార్యదర్శులుగా బీవీ రమణ, వి.చరణ్‌లు ఎన్నికయ్యారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులుగా జె.రవికుమార్, పి.సునీత, కె.దేవిక, పి.మహేష్, బి.గణేష్, ఎంఎస్‌డీ సత్యనారాయణ, ఎస్ శ్రీనులను ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా గౌరవాధ్యక్షుడు పలివెల సుబ్బారావు, ముఖ్య సలహాదారుడు ఎస్‌వీవీ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.నటరాజ్ సమక్షంలో జిల్లా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

ఫిర్యాదు బాక్సుల ఏర్పాటు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్‌ల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఫిర్యాదుల బాక్స్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు పుదుచ్చేరి విద్యాశాఖామంత్రి నమశ్శివాయం తెలిపారు. మంగళవారం ఆయన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ షాలినీసింగ్, డిప్యూటీ కమిషనర్ ఆర్ సత్యసుందరం, సీనియర్ ఎస్పీలు ఆర్ కలైవానన్, నర్రా చైతన్య తదితర సీనియర్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. పుదుచ్చేరిలో స్కూల్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు బాక్స్‌ల ద్వారా వచ్చిన ఫిర్యాదులపై తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు.

ట్రేడ్ లైసెన్సులు రెన్యువల్ చేసుకోవాలి

యానాం: మున్సిపాలిటీ పరిధిలో ఇంటిపన్ను బకాయిలు మార్చి 31లోపు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ కె రామకృష్ణ మంగళవారం సూచించారు. అదేవిధంగా యూజర్ చార్జీల బకాయిలు సైతం చెల్లించాలని సకాలంలో చెల్లించకుంటే జరిమానా విధిస్తారన్నారు. పట్టణంలోని వ్యాపారస్తులు 2025–26 ఆర్థిక సంవత్సరానికి గానూ ట్రేడు లైసెన్సు రెన్యువల్‌కు నగదు చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని కోరారు.

ఉచిత పశువైద్య శిబిరం

తాళ్లరేవు: రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జి.వేమవరం పంచాయతీలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏడీ బ్రహ్మవేద ప్రారంభించారు.